# కల్యాణి

## గొల్లపూడి మారుతీరావు

(వరంధామయ్య ఇల్లు - వంటగదిలో)

**శాంత :** రాధా. రాధా.

**రాధ :** (వస్తూ) ఏం అమ్మా ?

**శాంత :** మీ వదిన ఏం చేస్తోందే ?

**రాధ :** మడత కుర్చీలో కూర్చొని పేపరు చదువుకొంటోంది.

**శాంత :** (అదేదో ఘోరమయిన పనిలా) ఏమిటీ? పేపరు చదువుకొంటుందా?-అదేం పుణ్యమా? పురుషార్థమా?- రోజూ ఏం కొత్త విశేషాలు జరిగిపోతున్నాయని చదువుకూర్చోవాలి?....అక్కడ సమ్మెలూ, యిక్కడ చావులూ, పుట్టకులూ యివేగా?....ఏమిటానమ్మా? మా రోజుల్లో తీరిక దొరికితే చక్కగా ఏ సుందరాకాండో, అధ్యాత్మ రామాయణమో వల్లె వేసుకొనే వాళ్ళం.

**రాధ :** (వ్యంగ్యంగా) మరి వదిన చదువుకుంది కదటే?....తీరిక లేకపోయినా చేసుకొని పేపరు చదవడం ఓ ఫాషన్.

**శాంత :** చదువుకొంటే యేం? చదువుకొన్న వాళ్ళంతా యిలానే వున్నారా యేం? వాళ్ళేం కాపరాలు చెయ్యరా? పిల్లల్ని కనరా? చదువుకొన్న పెళ్ళాలు గలవాళ్ళు పొద్దున్నే వేడి కాఫీ కయినా నోచుకోరా యేం?

**రాధ :** మరి మీ రోజుల్లో కాఫీలున్నాయా అమ్మా.

**శాంత :** (ఎదురు చెప్పినందుకు విసుగ్గా) కాఫీ కాకపోతే పాలు- (మాటమార్చి) అన్నయ్యేం చేస్తున్నాడు.

**రాధ :** కాలేజీ నుంచి తెచ్చుకొన్న పేపర్లని మంచం దిగకుండానే దిద్దుకొంటూ కూర్చొన్నాడు.

**శాంత :** సరిపోయింది. ఈ ఎమ్మే గారికీ ఆ బియ్యే గారికీ జోడు సరిపోయింది. తెల్లవారకుండానే వీడో కాగితం ముందేసుక్కూర్చున్నాడన్నమాట....అందుకే మా రోజుల్లో ఆడదానికి పని, మగాడికి చదువూ అన్నారు....పాడయిపోయాయి....వెధవ రోజులు. మా అమ్మ పలకుచ్చుకుంటే వేళ్ళమీద గరిటితో రెండేసి పచ్చడి రుబ్బమని చక్కా లేవదీసుకు పోయేది.

**రాధ :** పాపం! వదినకూ అవన్నీ వచ్చులే....అయితే ఆవిడ గారికి హోంసైన్స్ కాలేజీలో. అవన్నీ నేర్చుకోవడంతోనే సరిపోయింది.

**శాంత :** అయితే వీళ్ళ స్కూళ్ళలోనూ ఈ పచ్చళ్లూ, కూరలూ వండటమే నేర్పారా ఏమిటి ?

**రాధ :** ఆ కాలేజీ అంతేనట.

**శాంత :** (మురిసిపోతూ) చూశావా? ఈ ఇంగ్లీషు చదువులు ఊడబొడిచిందేమిటి మహా. ఎంత చదువు చదివినా ఆడదానికి చాకిరీ చెయ్యక తప్పదని వాళ్లూ చెప్పనే చెప్పారు. మనం గ్రహించి చస్తేనా? ఎంత చదువుతే ఏం లాభం?- అక్కరకు రాకపోయాక. ఇందమ్మా....ఈ కాఫీ తీసుకెళ్ళి యిచ్చిరా-

**రాధ :** ఇది అన్నయ్యకి....ఇది మీ కోడలకి (కసిగా అంది)

**శాంత :** (కోపంగా) నువ్వేం పేర్లు పెట్టి చెప్పక్కర్లేదులే....వెళ్ళి యివ్వు....మా రోజుల్లో నలుగురూ చూస్తుండగా భర్త వున్న గదిలో నిలబడడానికే వణికిపోయేవాళ్ళం....అలాంటిది .... చెప్పుకొంటేనే సిగ్గు .... రామచంద్రా. రామచంద్రా.

[ముందుగదిలో - శాంతమ్మ మాట్లాడే చివరి వాక్యాలు అక్కడికి వినిపిస్తున్నాయి.]

రాజా : తెల్లవారింది కళ్యాణీ - మా అమ్మ గొంతు వినిపిస్తోంది.

కళ్యా : (పరాకుగా) ఏమిటండీ

రాజా : వినబడడంలా....మా అమ్మ దీవెనలూ-.

కళ్యా : (నవ్వి) తప్పండి. పెద్దవాళ్ళనలా అనకోడదు.

రాజా : నవ్వుతున్నావు కాని, అవి వింటూంటే నీకు బాధగా లేదూ ?

కళ్యా : ఎందుకూ బాధ ?

రాజా : ఈ యింటి కోడలయినందుకు-

కళ్యా : ఛఛ. అవేం మాటలండీ నాకేం బాధ లేదు.

రాజా : బాధ లేదంటే అబద్ధం చెప్తున్నట్టే లెక్క. గాంధీగారు ఈ చెంపమీద దెబ్బ పడితే రెండో చెంప అందించారట. అంత మాత్రాన దెబ్బ తగల్లేదని ఎలా అనుకోవడం.

కళ్యా : మరే మనుకొంటారు ?

రాజా : పరిస్థితి నర్థం చేసుకొనే శక్తి ఉందనుకోవాలి.

కళ్యా : (నవ్వి) మరి తెలిసీ నన్నడుగుతారేం ?

రాజా : ఈ బాధ ఎలా వుంటుందో తెలుసుకోవాలని-

కళ్యా : బాధేముందండి? కావాలని పువ్వును కోసుకొన్నాక ముళ్లున్నాయని కించపడతారా ....ఇంటికి వచ్చిన ఆడపిల్లకి మొదట బాధ్యతలే వస్తాయి. హక్కులరావు.

రాజా : అలాగా? అయితే మొదటి బాధ్యత ఈ సాధింపుల్ని తట్టుకోవడమా....

కళ్యా : కాదు. విటిని అంటున్న వారిని అర్థం చేసుకోవడం. ఆవిడ నా అంత చదువుకోలేదు. కాని జీవితంలో నాకంటే ఎక్కువే చూశారు. ఆవిడనే ఈ రెండు మాటలూ పడితే నేను చెడిపోను. ఈ మాత్రం అర్థం చేసుకోకపోతే నా చదువెందుకు చెప్పండి? మొదట ఆ పేపర్లు దిద్దడం కానివ్వండి. మార్కులు కూడేసి నేనూ వంట గదిలో చెయ్యి చేసుకొంటాను.

రాజా : అంతేకాని నోరు చేసుకోవన్నమాట.

కళ్యా : ఉహుం. (ఇద్దరు నవ్వుతారు)

రాజా : (కాస్సేపటికి) నీకు చాలా అన్యాయం చేశాను కళ్యాణీ.

కళ్యా : మళ్ళీ ఏమొచ్చిందండీ

రాజా : నీ లాంటి చదువుకొన్న దాన్ని యిలాంటి యింట్లో....

కళ్యా : నేనేం అంతఃపురాల్లో పెరగలేదు. మా నాన్న బడి పంతులు.

రాజా : అదికాదు. నిన్నర్థం చేసుకోలేని మనుషులమధ్య....

కళ్యా : పోనీ, మనం అర్థం చేసుకొంటే సరిపోతుందిగా? నిజానికి నష్టపోయింది మీరు.

రాజా : నేనా? ఏమిటి?

కళ్యా : పదివేల రూపాయల కట్నం. ఈ రోజుల్లో కాలేజీ చదువు చదివే అబ్బాయిలకి గిరాకీ ఎక్కువ. నిజానికి ఆ బాధ ఉండిపోయింది—అత్తగారి మనసులో.

రాజా : (ఆశ్చర్యంగా) నిజంగానా? నీ కెలా తెలుసు ?

కళ్యా : నేనూ ఆడదాన్ని....ఆ మాత్రం అర్థంకాదా? మన మధ్య తరగతి కుటుంబాల్లో చేతికందొచ్చిన కొడుకు పెళ్ళికి నాలుగు రాళ్లు వస్తే తోడబుట్టిన ఆడపిల్లకి పెళ్ళవుతుంది. మరి కొడుకు యిలా చదువుకొన్న బీద అమ్మాయిల్ని ఉద్ధరిస్తే ఏంకావాలి చెప్పండి? (నవ్వుతూ అంది)

రాజా : నువ్వు నాకంటే గొప్పదానివి కళ్యాణి. నేనయితే ఈ పరిస్థితులకి యింత త్వరగా రాజీ పడలేకపోయే వాడిని,

కళ్యా : సరేలెండి. ఆవిడ తిట్లకంటే మీ దీవెనలే బాధగా వున్నాయి. మీ పని కానివ్వండి.

రాజా : కళ్యాణీ! (ప్రేమగా, లాలనగా)

కళ్యా : రాధ వస్తున్నట్టుంది (దూరం)

రాధ : (కాఫీ గ్లాసుల్తో వస్తూ) అయితే పచ్చడి రుబ్బడం, కూరలు చేయడం కూడా మీ కాలేజీలో చెప్పారా వదినా (కావాలనే అడిగింది)

రాజా : (వేళాకోళంగా) అంతేకాదు. చాడీలు చెప్పడం, వదినల్ని వెక్కిరించడం కూడా నేర్పారు రాధా!

రాధ : (కోపంగా) నేనేం చాడీలు చెప్పడం లేదులే.

రాజా : లేకపోతే ఆ ముక్కెందుకే అంతలో ఎర్రబడింది?

కళ్యా : మీరూరుకోండి. ఇంటి పనిపాటలు చేసుకోవడం కూడా ఒక కళేనమ్మా, అవన్నీ ఒక పద్ధతిలో నేర్పుతారు,

రాజా : ఇప్పుడర్థమయిందా ?

రాధ : ఇంటి పనులు నేర్చుకొనే గతి పట్టలేదు....అయినా ఏ చదువూ లేనిదాన్ని....నా కెందుకు? (రుస రుసా వెళ్ళిపోయింది)

## పాత్రలు

| | | |
|---|---|---|
| శాంతమ్మ | : | |
| పరంధామయ్య | : | |
| అలివేలు | : | పరంధామయ్య పిల్లలు |
| రాధ | : | పరంధామయ్య పిల్లలు |
| రాజారావు | : | పరంధామయ్య పిల్లలు |
| కళ్యాణి | : | రాజారావు భార్య |
| సుబ్బారావు | : | అలివేలు భర్త |
| శంకరం | : | పెళ్ళికొడుకు |
| గంగాధరం | : | శంకరం తండ్రి |
| సీతమ్మ | : | తల్లి |
| సుగుణ | : | |
| బ్యాంకు ఏజెంటు | : | |
| ప్యూన్ | : | |

**కళ్యా :** పాపం, ఆ పిల్లని ఎందుకండీ ఏడిపించారు ?

**రాజా :** ఏడిస్తే బాగుంటుంద ....అయితే భర్తల కాలేజీ పేర్లు దిద్ది పెట్టడమూ నేర్పరా మీ కాలేజీలో ?

**కళ్యా :** ఉహూం....అల్లరి భర్తకి యిల్లాలిగా ఉండటం ఎలాగో నేర్పారు. యిక లేవండి. మిగతా పని స్నానం చేశాక చూసుకొందురుగాని.

(ఆ రోజ మధ్యాహ్నం)

**పరం :** (వీధిలోంచి వచ్చి కాళ్ళు కడుక్కుంటూ) ఏమే! అన్నం వడ్డించు. ఏమే! (మళ్ళీపిలిచాడు) (లోపలికి వచ్చి) ఓహో అప్పుడే అన్నీ సిద్ధంగానే వుంచావ్ !

**శాంత :** (నిష్ఠూరంగా) మీ పని మీరు చెయ్యకపోయినా యీ ముప్పయ్యేళ్లాయి నా పని నేను తంచన్గా చేస్తూనే ఉన్నాను.

**పరం :** ఇవాళ మళ్ళీ ఏమొచ్చిందే నీకు ?.... నా పనేమిటి ? నీ పనేమిటి ?

**శాంత :** నాకు తెలీక అడుగుతాను? రోజు ముప్పూటలా ఆ శెట్టి దూకాణం ముందు కబుర్లేసుకు కూచోడమేనా ఏమిటి మీ పని ?

**పరం :** లేకపోతే నీతో చెప్తా ఈ వంట యింట్లో కూచో మంటావా ?

**శాంత :** ఆహా! ఈ బ్రతుక్కి ఆ సంతోషం కూడాను. చెట్టంత పిల్ల.... పెళ్ళికి ఎదిగి ఎదురు రొమ్ముమీద కూచొంటే ఎక్కే గుమ్మం దిగే గుమ్మంగా కుర్రాణ్ని వెదుక్కోవాలి గాని, ఏం పట్టనట్టు కబుర్లూ కాలక్షేపకాయలూ ఎందుకూ ?

**పరం :** (నిర్లిప్తంగా, ప్రశాంతంగా అడిగాడు) మా యింట్లో చెట్టంత పిల్ల ఉంద - రేపట్నుంచీ కబుర్లు చెప్ప మంటావా ?

**శాంత :** ఆఁ....ఇలాగే మాటల్తోనే జయించుకు వస్తున్నారు యిన్నాళ్లూ.

**పరం :** శాంతీ! ఆ ఘడియ వస్తే బ్రహ్మరుద్రులు వచ్చినా ఆ శుభకార్యాన్ని ఆపలేరు. రాదూ?- మనం ఏం ప్రయత్నించీ ఏం లాభం ?

**శాంత :** ఈ మెట్ట వేదాంతం చెప్పే మన మెడకి తెచ్చారు, ఈనిర్లక్ష్యం అలుసు చేసుకొనే కానీ కట్నం లేకుండా బియ్యే చదువుకొన్న అమ్మాయిని నెత్తిన ఎక్కించుకొన్నారు,

**పరం :** మంచిదేగా. వాడికి నచ్చిన పిల్లని వాడు చేసుకొన్నాడు.

**శాంత :** (పరిహాసంగా) ఓహో! మీ అమ్మా నాన్న చూసి చేస్తే నేను మీకు నచ్చకుండా పోయానా యేమిటి ?

**పరం :** (కాస్త నెమ్మదిగా) అది భగవంతుడికే తెలియాలి,

**శాంత :** వాడికి కట్నం రాళ్ళు నాలుగు వస్తే ఆ చిన్నదానికీ మూడుముళ్ళూ వేయించే వాళ్ళమా ?

**పరం :** ఇప్పుడేమయ్యిందే?

**శాంత :** ఏమయిందో ? ఇప్పుడేముందని పెళ్ళి జరిపిస్తారు?- నా పెళ్ళికి పసుపు కుంకానికి నాన్నగారు ఆ రెండెకరాలు యివ్వబట్టి పెద్దదానికయినా పెళ్ళి చేసి సాగనంపగలిగాం. ఇప్పుడెముందని చేస్తారు?- వచ్చిన ఆ ప్రావిడెంట్ ఫండు కాస్త "యిల్లు, యిల్లు" అంటూ దీనిమీద పెడితిరాయే.

**పరం :** అవును. బ్రతికినన్నాళ్ళు అద్దె యింట్లో బ్రతుకుతూ చావలేక- చచ్చేలోపున సొంత కొంపలో బ్రతుకుదామని ఈ కొంప కొన్నాను. తప్పా?

**శాంత :** అంత ఆలోచన సంపాదించే రోజుల్లో ఉంటే మా భేషగ్గానే ఉండెది కాపురం, నలుగురు గుమస్తాలూ అటూ

యిటూ పడి ఒకటికి ప౧ సంపాదిస్తుంటే. మీరు బ్రతుకంతా ఆ జీతం రాళ్ళే తెచ్చారు, ఇప్పుడేం పెట్టి పెళ్ళి చేస్తారు. మీ పెన్షన్ డబ్బులతోనా? మీ పెద్ద కొడుక్కి వచ్చిన కట్నంతోనా?

పరం : మొదట సంబంధం చూడలేదన్నావు. ఇప్పుడు పెళ్ళంటున్నావు? ఇంకాస్సేపటికి అమ్మాయిని కాపరానికి పంపడం అంటావు. అన్నానికి ముందు దీవనలు వర్తించకపోతే నీ ఆలోచనేమిటో చెప్పరాదూ?

శాంత : (దగ్గర కూర్చొని) నా మాట విని - తొందరగా రాధకి సంబంధం చూడండి.

పరం : (ఎవరో పై వాళ్ళు అడిగినట్టు) ఎంత కట్నం యిస్తావేం?

శాంత : ఎంతా? ఈ యిల్లు ధర చేసినంత,

పరం : ఇల్లా? ఈ ఇల్లు అమ్మాలా?

శాంత : ఏం? దీంతోటే మన ఊరేగుతామా?- వద్దు వద్దంటూంటే కొన్నారాయే. కావాలన్నప్పుడు అమ్మక తప్పదు. ఆ పుణ్యకార్యమూ జరిగిపోతే మన బ్రతుకులు గట్టెక్కుతాయి, ఏం మాట్లాడరేం?

పరం : (నెమ్మదిగా) నువ్వు పెళ్ళి గురించి ఆలోచిస్తూంటే-నేను పెరుగు గురించి ఆలోచిస్తున్నాను, వెయ్యి మరి కాస్త,

శాంత : అయ్యో నా రాత. మీతో ఎంత చెప్పినా మతిలేని వ్యవహారం అయిపోయింది గదండీ. రామచంద్రా, రామచంద్రా,

(ఒక రోజు ఉదయం)

ఇంటి ముందు గంటల చప్పుడు చేస్తూ బండి ఆగింది,

రాధ : అమ్మా. అమ్మా, అక్కయ్యొచ్చిందే, ఏం అక్కా? చెరుకుగడలు తెచ్చావా?

అలివేలు : లేదే. బావగార్ని తెచ్చాను.

రాధ : (సిగ్గు) పో- ఓహో నిజంగానే బావ వచ్చాడే అమ్మా, బావొచ్చాడు.

శాంత: (ఇప్పుడు వస్తూ) ఏం అమ్మా, అంతా బావున్నారా?

అలి : బాగున్నారమ్మా-

శాంత: నువ్వలా చిక్కిపోయావేమే, ఏం? మళ్ళీ....

అలి : (సిగ్గు) అవునమ్మా- ఆరోనెల....

శాంత: పోనీలేలమ్మా. ఐదుగురు పిల్లల్తో యిల్లు కళకళలాడుతుంది, మా అమ్మ అనేది యింటికి సంతానమే శోభ అని.

అలి : ఏం శోభోనమ్మా. ఇంటినిండా సంతానమే కనిపిస్తోంది. మరేమీ కనిపించడం లేదు.

రాజా : ఎప్పుడొచ్చావు చెల్లాయ్ -

అలి : ఇప్పుడేరా- పండగ దగ్గర పడుతోందని-

రాధ : ఇంకా ఎక్కడి పండగక్కా- నాలుగు నెలల మాట-

శాంత : (నెమ్మదిగా) నువ్వు నోరుమూసుకో అల్లరిదానా.

రాజా : ఓహో. బావ కూడ వచ్చాడే. ఏం బావా? ఫ్యాక్టరీ పని ఎలా వుంది.

సుబ్బా : పనికేం? ఆరోగ్యంగా వుంది- విశాఖపట్టణంలో నాలుగు నెలల ట్రైయినింగ్ వుంది. మీ చెల్లెల్ని యిక్కడ వదిలి వెళ్దామని. ఈ పెట్టెలు ఎక్కడ పెట్టాలి?

రాధ : ఈ యింటినిండా గదులే బావా. యిప్పటికి పెట్టెలు కూడా వుంటాయి. ఇలా తీసుకురా.

అలి : అమ్మా. రాధకి ఆయనో మంచి సంబంధం చూశారు.

శాంత: నాతల్లే. చదువురాని వాడయినా అల్లుడే మాకు అండ అవుతున్నాడు. ఇంట్లో ఉన్న మగవాళ్ళకన్న అతనే మెరుగనిపించుకొన్నాడు. ఎవరిదమ్మా సంబంధం.

అలి : అచ్చువెల్లి వారని-మనవాళ్ళే-

రాధ : బావలాగ ఫ్యాక్టరీలో పనిచేసే వాడయితె నా కొద్దమ్మా, రోజూ ఆ నూనె గుడ్డలు వేసుకోవాలి. నాకు డోకు.

అలి : మరి అన్నయ్యలాగా సూటు వేసుకొనే వాడ్ని చేసుకోడానికి నువ్వేం బియ్యే ప్యాసయావా?

రాధ : చూశావమ్మా అక్క ఎలా వెక్కిరిస్తోందో-

అలి : ఊరికే అన్నా లేవే. అబ్బాయి ఏదో బ్యాంకులో గుమాస్తాట, రెండు వందలిస్తారు.

శాంత: అయితే మంచి సంబంధమే.

అలి : నాన్నగారిచేత ఉత్తరం వ్రాయిస్తే వాళ్లు చూపులకి వస్తారు.

శాంత: అలాగేనమ్మా- అలాగే.

అలి : వదినె కనిపించదేం అన్నయ్యా-

రాజా : నా సూటు ఇస్త్రీ చేస్తోంది.

రాధ : (వెళ్తూ వెళ్తూ) చాకలాళ్ళ లాగ.

అలి : అదేమిటే. మన పని మనం చేసుకోవడంలో తప్పేముందే?

కాంత: దానికలా తోచింది. పో నీలే. ఏకంగా కాన్వెంటు యిక్క-ఉండిపో-

అలి : (కృతజ్ఞతగా) అలాగేనమ్మా- నువ్వా మాట అంటావని తెలుసు....

రాధ : రాముడేం చదువుతున్నాడక్కా?

రాజా : ఏమయినా వార పత్రికలు కాదులే.

రాధ : వాడినలాగ నాకు చదువు రాదులే- ఇంగ్లీషు పత్రికలు చదవడానికి.

అలి : పోనీలేవే. రాముడు వీధిబడికి వెళ్తున్నాడు. సుమతీ శతకంలోని పద్యాలు చదువుతాడు.

రాజా : కళ్యాణీ, కళ్యాణీ.... అలివేలూ, పిల్లలూ వచ్చారు.

కళ్యా : (లోపల్నుంచి) వస్తున్నా. మీ సూటు తయారయింది. వేసుకోండి (వచ్చి) ఏం వదినా? బాగున్నారా?

అలి : బాగున్నానమ్మా. అదేవిటి? నువ్వలా చిక్కిపోయావు.

కాంత: (వినిపించీ వినిపించనట్టు) అంతా నాజూకు బ్రతుకయిపోయే.

కళ్యా : నాకేం - బాగానే వున్నాను.

అలి : అంతేనా? నాకు మేనల్లుడ్ని అందించబోతున్నావా?

కాంత: ఆఁ, అన్నిటికీ సాయం అదొహటి. ఈ కాలం చదువుల్లో పిల్లలూ వద్దని ఘోషపెడుతున్నారుగా? మా రోజుల్లో సంవత్సరం తిరక్కుండా వంశోద్ధారకుని ఎత్తుకోవాలనే వారు.

అలి : పిల్లలు వంశాలు ఉద్ధరిస్తారో లేదో తెలీదుకాని మా పిల్లలు యిల్లు తీసి పందిరేస్తున్నారు. అన్నా వదినా అయినా కొన్నాళ్ళు అలా వుండండి- వదినెకేం? బంగారంలాంటి పిల్లలు పుడతారు.

రాజా : (వస్తూ) నేను రెడీ కళ్యాణీ.

అలి : దంపతులిద్దరూ వీధిలోకి బయలుదేరినట్టుంది.

రాజా : నేను కాలేజీకమ్మా- మీ వదినె బజారులో ఏమో కొనుక్కోవాలట. ఉంటావుగా బావా?

సుబ్బా: (లోపల్నుంచి) ఉంటానోయ్- నాలుగయిదు రోజులయినా ఉంటా.

అలి : మిమ్మల్ని చూస్తే ముచ్చట వేస్తోంది కళ్యాణీ. నీలాంటి భార్య దొరికినందుకు అన్నయ్య నిజంగా అదృష్టవంతుడు.

రాజా : కాని అమ్మ అలా అనుకోవడంలేదు చెల్లాయ్.

అలి : అమ్మ సంగతి తెలియనిదేముంది అన్నయ్యా- దానిది వానాకాలం చదువు. అందరికీ ఆ చదువు చాలంటుంది.

రాజా : నువ్వు? నువ్వు మాత్రం పెద్ద చదువుకొన్నావేమిటి? నీకు మరి యింత సంస్కారం అబ్బిందేలా?

అలి : ఆఁ. నా సంస్కారానికేంలే? సంసారంలో పడి నాలుగు ఒడుదుడుకుల్ని చూస్తే అదే అబ్బుతుంది. అమ్మ మాటలకి నువ్వు మనస్సు కష్టపెట్టుకోవద్దు కళ్యాణీ.

కళ్యా : నేనా? నాకా ఆలోచనే లేదమ్మా. మీ యింటికి రావడం నా అదృష్టంగా భావించుకొంటున్నాను.

రాజా : సరి, ఇదో కథలే. ఈవిడ దృష్టిలో అమ్మ ఓ దేవత. ఇంక వస్తాం. కాలేజీకి వేళవుతోంది.

(మరో రోజు సాయంకాలం

పెళ్ళి చూపులకి శంకరం, తండ్రి గంగాధరం,

తల్లి సీతమ్మ వచ్చారు.)

గంగా : బావగారూ ఇక పెళ్ళి కూతుర్ని పిలిపించండి.

పరం : ఏమే. అమ్మాయిని తీసుకురండి. ఈ పుణ్యమంతా మీదీ, మా అల్లుడు సుబ్బారావుదీను. ఇన్నాళ్ళకు మీదయ వల్ల ఆ శుభముహూర్తం కలిసి రాబోతోంది.

గంగా : మనదేముంది బావగారూ. కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదన్నారు.

పరం : మా పెద్దకోడలు కళ్యాణి - బియ్యే చదువుకొంది.

కళ్యా : నమస్కారమండి.

గంగా : నమస్కారమమ్మా. చాలా పెద్ద చదువులు చదువుకున్న కోడల్నే యింటికి తెచ్చుకొన్నారు. మరి అమ్మాయిని ఏం చదివించారేమిటి?

పరం : అమ్మాయిని....అమ్మాయిని...

కాం : ఆఁ....చదువులమీద మా కాస్త నమ్మకంలేదు అన్నగారూ! ఆ మాటకి వస్తే నేను చదువుకోలేదు. మా అమ్మ చదువుకోలేదు. మా అమ్మమ్మ చదువుకోలేదు. అయినా ఏదో సెకండుఫారం దాకా సంసార పక్షంలో చదివించాం. ఉత్తరంముక్క రాసేపాటి చదువు చాలదా ఏమిటి?-

గంగా : అహ. చాలకనేనా కోడల్ని బియ్యే పిల్లని తెచ్చుకున్నారని ఆశ్చర్యపడ్డానంతే. (నవ్వేసి) ఈ కాలంలో చదువులకేమొచ్చెలెండి. అమ్మాయిని రప్పించండి. (రాధని కళ్యాణి, అలివేలు తీసుకు వచ్చారు)

అలి : అక్కడ కూచో రాధా.

రాధ : నా కేదో భయంగా వుంది వదినా?

కళ్యా : (నవ్వి) భయం యిప్పుడు కాదులే, ఇప్పుడు కావలసింది సిగ్గు, పొడమంటారేమో. గొంతు సవరించుకో.

రాధ : పో.

రాజా : శంకరంగారూ. ఈమె మా చెల్లాయి-రాధ.

శంక : మనలో మన మాట - ఆ పేరంటే నా కెంతో యిష్టం.

రాజా : (నవ్వి) తమాషాగా మాట్లాడతారే మీరు. మీరు కాలేజీలో వుండాల్సింది.

శంక : మా బ్యాంకులో చాలామంది కాలేజీ లెక్చెరర్ల ఖాతాలున్నాయిలెండి. వాళ్ళతో మాట్లాడిన అలవాటేమో.

రాజా : (నవ్వుతాడు)

సుబ్బా: ఏమిటోయ్ అంత నవ్వు?

రాజా : భలే పెన్సాన్ హ్యూమర్ ఉన్న పెళ్ళి కొడుకుని సంపాదించావు బావా - ఐ లైక్ హిమ్.

[ఇటు పెద్దవాళ్ళు]

గంగా : అమ్మాయికేం? లక్షణంగా వుంది - నాకు నచ్చింది.

వరం : మరి అబ్బాయికి -

గంగా : కన్నూ ముక్కూ తీరూ ఇంత బాగుంటే వాడికి నచ్చకేం చేసుంది. నా మాటే మా వాడిమాట.

సీత : నీ పేరేమిటమ్మా.

రాధ : రాధ.

సీత : చాలా చక్కటి పేరు.

గంగా : బావగారూ. అయితే అమ్మాయికి సంగీతం గట్రా ఏమయినా నేర్పించారా? లేక సంసార పక్షంగా....

కళ్యా : లేదండి, మా రాధ చక్కగా పాడుతుంది. ఏదమ్మా ఒక్క పాట పాడు,

రాధ : పో వదినా. భయంగా ఉంటే ఇప్పుడు పాడేమిటి?

కళ్యా : తర్వాత రహస్యంగా ఆ వనముందే పాడుకోవచ్చులేమ్మా, ఈసారయినా అందర్నీ వినసీ, (పాట పాడింది)

గంగా : కంఠం కూడా అద్భుతంగా వుంది; బావగారూ, మీరు అదృష్టవంతులు. మీ ఇంట ఒక పక్క విద్య, మరొక ప్రక్క సంగీతం పీట వేసుక్కూచున్నాయి,

వరం : ఏదో తమ దయ. మరి మీకు పిల్లనచ్చింది. కనక మనం కాస్త పై విషయాలు —

గంగా : ఆఁ, పై విషయాలకేం బావగారూ. అవి వేరే మాట్లాడుకోవాలా? మామూలేగా,

వరం : అవుననుకోండి. అయినా మీ ఆలోచనలకి నేను తూగగలనో లేదో ఒక్కసారి—

గంగా : ఏం సుబ్బారావుగారూ?

సుబ్బ : అయ్యా, ముఖాముఖీ మాట్లాడండి. మీ మామగారేమీ అనుకోరు.

గంగా : అయినా చూడండి బావగారూ? ఈ కట్నాలమీద సుతరామూ నాకు నమ్మకంలేదు. కట్నాలు వద్దంటూ ఆమధ్య చట్టం చేశారే - దానికి నా నూటికి నూరుపాళ్ళూ ఏకీభావమే. కానయితే - అబ్బాయి చదువుకి బోలెడయిపోయింది, చదవడానికి బిడ్డయే అనుకోండి అయినా లంకమేత గోదావరి యీత గాగ - నాది పల్లెటూరి వాసం, వాడిది పట్నం చదువు అయిపోయింది, అదీగాక వీడి తరవాతి అమ్మాయి పెళ్ళికొచ్చింది. మరి పెళ్ళంటే మీకూ తెలుసుకదా.

వరం : అవునులెండి.

గంగా : అందుకని - ఓ పది చేసుకోండి -

శాంత : ఏమిటి? వేలే.

సీత : ఆ పైన వెండి చెంబు, కంచం, పట్టు తాపితాలు ఇచ్చే సంప్రదాయం మీకు మాత్రం తెలియనిదా - పోతే, ఒక్కగానొక్క ఆడపిల్ల. దానికి ఆడపడుచు లాంఛనం వెయ్యిన్నూటపదార్లు,

గంగా : అవి వాళ్ళకి మాత్రం తెలియదా ఏమిటి? ఆ అమ్మాయి బావకు ఇద్దరుంటాయనీ, పెళ్ళికి ఏభయ్యో వందో మంది వస్తే సత్కారాలు చెయ్యాలనీ మనం చెప్పాలా? ఏం బావగారూ,

రాజా : కాని అంత స్తోమతు మాకులేదు మామగారూ.

గంగా : (నవ్వి) భలే జోక్ వేశావోయ్. నువ్వు పని చేస్తున్నావు. బావగారు హెడ్ గుమాస్తాచేసి రిటైరయారు, ఇంత పెంకుటిల్లుంది. స్తోమతు లేదంటే మీ వినయం చెప్తోంది కాని, నిజమని నమ్మమంటావూ? అంతెందుకు? నువ్వు మాత్రం కట్నం లేకుండా ఆ అమ్మాయిని చేసుకొన్నావా?

కళ్యా : మా వాళ్ళేం కట్నం ఇచ్చుకోలేదండి,

శాంత : (పళ్ళు కొరుకుతూ) ఇంకా సిగ్గులేక చెప్తోంది కూడాను, అదే మా కొంప ముంచింది.

అరి : ఇష్. నువ్వుండమ్మా, వదినెని మాట్లాడనీ,

కళ్యా : ఏమీ పుచ్చుకోకుండానే ఆయన నన్ను చేసుకున్నారు.

గంగా : ఆశ్చర్యంగా వుందే. అయినా మీ అదృష్టం బాగుంది బావగారు. అందరికీ మీ అబ్బాయిలాంటి అల్లుడు కలిసి వస్తాడా? ఇంట్లో ఆడపిల్ల ఉందంటే ముందు జాగ్రత్తలు పడాలి. చూడండి. మీరు మరో విధంగా భావించకండి,

మరొక ప్రక్క :—

శంక : ఏమిటమ్మా - కట్నంకోసం ఈ బేరాలు. వాళ్ళస్థితి చూస్తూ చూస్తూ ఎందుకి నిలదీయడం?

సీత : నువ్వూరుకో. నీకేం తెలీదు దయ, జాలి, త్యాగం యివన్నీ అనుకోడానికి బావుంటాయి. కాని మన దాకా వచ్చేసరికి — మనం పిల్లనిచ్చే వాళ్ళు అనుకోరు. నువ్వూరుకో.

శంక : ఏమిటమ్మా. నా పెళ్ళి నా ఇష్టం కాదా?

సీత : శంకరం! కాదని ఎవరన్నారు? కాని ఒక్కమాట చెప్పు. నీ చెల్లెలి పెళ్ళి నీ కిష్టంలేదా?

శం : అమ్మా.

సీత : అదంతే. నువ్వూరుకో. నాన్నగారిని మాట్లాడనీ,

ఇటు పెద్దలు :-

వరం : అన్నీ లక్షణంగా అమిరాయనుకొన్నాను బావగారూ,

గంగా : ఎంతమాట. మీరు సరేనంటే కుదిరినట్టే.

వరం : నాకు ఎటూ ఆలోచన పోవడంలేదు. మరొక్కసారి ఆలోచించుకు వ్రాస్తాను.

గంగా : (నవ్వి) ఆ మాటకి అర్థం బోధపడిపోయిందనుకోండి. అలాగే కానివ్వండి. సీత - ఇకలే. వస్తాను బావగారూ.

వరం : బాబూ రాజారావు, నువ్వూ సుబ్బారావూ వారిని దిగబెట్టిరండి.

పెళ్ళివారు వెళ్ళాక -

శాం : చూశారుగా జరిగిన పరాభవం? వాళ్ళు ఉన్నమాటే అన్నారు. చెయ్యాల్సినవే చేశారు. వాళ్ళకి ముందు చూపుంది. ముందే జాగ్రత్తపడ్డారు. మనకి లేదు. మనం అనుభవిస్తున్నాం.

పరం : అమ్మా కళ్యాణీ, రాధని లోపలికి తీసుకువెళ్ళమ్మా.

అలి : ఏమిటమ్మా - వదినె ఉండగానే అంతలేసి మాట లంటావు. ఆవిడ మనస్సు బాధ పడదూ.

శాం : ఇంకా మనుషుల వెనక మాటలు అనడం అలవాటు కాలేదమ్మా. ఉన్నమాటేదో ముఖంమీద అంటాను. వాడు చదువుకున్న భార్యని చేసుకొన్న పుణ్యానికి ఇదిలా పెళ్ళి లేకుండా ఇంట్లో పడి వుండాల్సి వస్తోంది.

అలి : ఎల్లకాలం ఇలాగే వుండిపోతుందేమిటమ్మా - పిళ్ళు కాక పోతే మరొకరు.

శాం : ఏమిటే. మరొకరు మాత్రం ఇంతకన్నా మంచిగా వుంటారనా నీ ఉద్దేశం? మీ ఆయన వెదికాడు కనక



ఈ సంబంధమయినా వచ్చింది-ఇక ఈయన సంబంధం తెచ్చారు. దాని పెళ్ళయింది.

పరం : అదెప్పుడూ దానికి తోచిన ఆలోచనే కాని మరొకరి ఆలోచనకి చోటివ్వదు. నువ్వెళ్ళిపోయాక నాకు సలహా చెప్పేవారూ లేకపోయారు తల్లీ, ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో చెప్పు.

అలి : ఏముంది నాన్నా? అమ్మ చెప్పినట్టు ఎప్పుడో ఒకప్పుడు ఈ పరిస్థితిని ఎదుర్కోవాల్సిందే. అబ్బాయి బాగున్నాడు. అప్పో సప్పోచేసి ఆ మూడు ముళ్లూ వేయించేస్తే—

పరం : మన కప్పు ఎవరిస్తారమ్మా?

శాం : అయితే ఇల్లు బేరం పెట్టండి.

పరం : ఇంటినా? కొని అయిదేళ్ళయినా కాలేదు.

శాం : పద్దెనిమిదేళ్ళు పెంచిన మమతుపమీదకన్నా, అయిదేళ్ళయి వుంటున్న ఇంటిమీద మీకు వ్యామోహమా? - ఎవరేనా వింటే నవ్విపోతారు. అమ్మికి ఆ పెళ్ళి అయిందనిపిస్తే - యీ ఇల్లు పోతే మనం చెట్టుకింద ఉంటాం. బాధ్యతలు తీరిపోయాక చెట్టు నీడయినా హాయిగానే వుంటుంది.

(పరంధామయ్య ఆలోచిస్తున్నాడు. రాజారావు, సుబ్బారావు వచ్చారు)

శాంత : వాళ్ళు వెళ్ళిపోయారేంరా?

రాజా : వెళ్ళారమ్మా.

సుబ్బా : త్వరలో తేల్చి ఉత్తరం వ్రాయమని గంగాధరంగారు మళ్ళీ గుర్తు చేశారండి.

పరం : ఇంక తేల్చాల్సింది ఏమిలేదు బాబూ. కొన్న మమకారం తీరక, ఇక్కడ నీడకోసం ప్రలోభ పడ్డాను. అంతకంటే అమ్మాయిని పెంచిన మమకారం ఎక్కువని ఆవిడ గుర్తు చేసింది. నిజమే. తండ్రిగా నా బాధ్యత నేను నెరవేర్చుతాను. ఇంటిని బేరం పెడతాను. సంబంధం నిశ్చయం చెయ్యమని రేపే రాస్తాను.

శాం : శుభం.

గదిలో :

కళ్యా : రాధ ఏడుస్తోందండీ.

రాజా : నన్నేం చెయ్యమంటావు?—

కళ్యా : అదేమిటండీ? ఇంటికి పెద్ద కొడుకు మీరు. మామగారికి వయస్సు మీరపడుతోంది. ఇలాంటి కష్ట సమయంలో మీరు కలగజేసుకోపోతే ఎలా?

రాజా : నిజమే కళ్యాణీ. కాని ఓసారి పందెంలో ఓడిపోయిన వాడికి మరొకసారి పందానికి నిలబడే అధికారంలేదు.

క : అంటే?

రా : నీకు తెలీదా?

క : నన్ను పెళ్ళి చేసుకొని వాళ్ళ దృష్టిలో వీగిపోయారనా?

రాజా : ఊఁ. నాన్నగారికి అలివేలు విచక్షణ మీద వున్న నమ్మకం, నా సమర్థత మీద లేదు. అయినా నేను కల్పించుకు చేయగలిగేది ఏముంది. ఉన్నపాటున పదివేలు పుట్టించలేను.

కళ్యా: అదొక్కటే నా చెయ్యవలసిన పని?

రాజా : ఇంటిమీద అప్పు తెచ్చినా తీర్చటం కష్టం. నా జీతంతో, నాన్న పెన్షన్‌తో యింటి ఖర్చులే అంతంత మాత్రంగా గడుస్తున్నాయి. మన కుటుంబాల్లో సుఖ సంతోషాలు దాదాపు డబ్బుకే బలి అయిపోతున్నాయి కళ్యాణీ. మనం అనేదేం లేదు. మరో సంబంధం దొరికేవరకూ ఆగడం తప్ప.... ఏమిటాలోచిస్తున్నావు?

కళ్యా : నాకో చిన్న సహాయం చెయ్యాలి మీరు.

రాజా : ఏమిటది?

కళ్యా : మిమ్మల్ని చేబట్టాక యీ యిల్లు నా యిల్లయింది. ఇంత వరకూ మీతో సుఖాల్నే పంచుకున్నాను. ఇకనుంచీ మీ కష్టాల్నీ పంచుకొనే అవకాశం యివ్వండి నాకు.

రాజా : అదేమిటి కళ్యాణీ. యివాళ వింతగా మాట్లాడుతున్నావేమిటి?

కళ్యా : అవునండి. రాధ దుఃఖాన్ని చూడలేక పోతున్నాను. నన్ను కట్టుకొన్నప్పటి నుంచి యీ ఇంట్లో మీ పట్ల నిర్లక్ష్యాన్ని గమనిస్తున్నాను. చదువుకొన్న పెళ్లాం గుదిబండ అని ఇక్కడ కొంతమంది కయినా అభిప్రాయం వుంది. ఆ అభిప్రాయాన్ని తొలగిస్తాను.

రాజా : ఏమిటి కళ్యాణీ ఈ ఆవేశం?

కళ్యా : ఆవేశం కాదండీ? మిమ్మల్ని అసమర్థులనుకుంటే ఒకటి. నన్నునుకొంటే ఒకటికాదు. నాకు మాట ఇవ్వండి.

రాజా : ఏమిటి.

కళ్యా : నేను చేసే పనిని మీరు సమర్థించాలి.

రాజా : ఎందుకు సమర్థించను? - తప్పకుండా.

కళ్యా : ఆ మాట చాలు నాకు. ఇకనుంచీ మన ఇంటి పరిస్థితుల్ని నేను చక్కబెట్టగలనేమో చూస్తాను.

రాజా : కాని అది చాలా పెద్ద సవాలు కళ్యాణి. ఈ మధ్య తరగతి వ్యవస్థ ఏ ఒక్కరితో ఏ ఒక్క రోజులో బాగయేది కాదు.

కళ్యా : పోనీ నన్నూ ప్రయత్నించనివ్వండి.

రాజా : నీ ఇష్టం. కళ్ళు తుడుచుకో ఇంక.

కళ్యా : మీ లాంటి భర్త దొరకడం నిజంగా నా అదృష్టం. అది నేనేకాదు. ఈ ఇంట్లో వాళ్ళంతా అనుకొనేటట్టు అనేటట్టు చేస్తాను.

రాజా : [ప్రేమతో] కళ్యాణీ.

.... .... ....

[ఏడుస్తున్న రాధ దగ్గరకు వచ్చింది కళ్యాణి]

కళ్యా : రాధా!

రాధ : వొదినా [ఏడుస్తుంది]

కళ్యా : ఎందుకేడుస్తున్నావు రాధా ఇప్పుడేమయిందని: పెళ్ళి సంబంధం తప్పిపోతే ఇక పెళ్ళి కానట్టేనా ఏమిటి ?

రాధ : నా వల్ల అందరికీ కష్టాలు. నాన్నగారు నా కోసం ఇల్లు అమ్మడానికి ఎంత బాధపడుతున్నారో తెలుసు వదినా. ఈ చూరుకిందే మీకు పెళ్ళి చేశారు. నేనుండి ఈ కుటుంబానికి విలవలేక లేకుండా చేస్తున్నాను.

కళ్యా : ఛఛ: ఏమిటమ్మా ఈ మాటలు ! - నేనూ ఆడదాన్నే - మా అంతటి వాళ్ళే. మరి నాకు పెళ్ళి కాలేదూ ?

రాధ : మీకేం వొదినా? నువ్వు చదువుకొన్నావు.

కళ్యా : కావాలనుకొంటే నువ్వు చదువుకోలేవా ?

రాధ : [ఆశ్చర్యంగా] నేనా. నా కిప్పుడు చదువొస్తుందా వొదినా.

కళ్యా : పిచ్చిపిల్ల. చదువుకి వయస్సెప్పుడూ మించిపోదు. నువ్వు చదువుకొంటానంటే నేను చదువు నేర్పుతాను.

రాధ : నిజంగా నేర్పుతావా వదినా.

కళ్యా : నేర్పుతానమ్మా. ఒక్క షరతు. కొన్నాళ్ళు పెళ్ళి గురించి ఆలోచించకూడదు.

రాధ : అమ్మ హడావుడిగాని, నా పెళ్ళి కేం తొందర వదినా? నేను నాన్న, అన్నయ్యకీ బరువు కాకుండా చెయ్యి. నీకు దణ్ణం పెడతాను.


కళ్యా : తప్పకుండా రాధా. ఇవాళే నీ చదువుకి ప్రారంభం. మధ్యాహ్నంవెళ్ళి పుస్తకాలు కొని తెస్తాను.

రాధ : అలాగే వొదినా.

[వసారాలో కూర్చునిపరంధామయ్య గీత చదువుకొంటున్నాడు]

కళ్యా : మామగారూ.

వరం : ఎవరూ. కళ్యాణా? ఏమమ్మా ఇలా వచ్చావ్?



ర చ యి త

కళ్యా : మీతో రెండు విషయాలు మాట్లాడదామని,

వరం : ఏమిటమ్మా అది? -

కళ్యా : రాధ ఇప్పట్లో పెళ్ళిచేసుకోదు మామగారూ.

వరం : [విభ్రాంతపోయి] పెళ్ళి చేసుకోదా, అదేం ?

కళ్యా : చదువుకొంటుందట. నేనే చదువు చెప్తాను.

వరం : [ఏం చెప్పాలో తెలీక] మంచిదే. కాని ఈ వయస్సులో. ఇంతలో మనస్సు ఎందుకు మారిపోయింది....

కళ్యా : అందుకు నేనే కారణం మామగారూ. చదువుకొన్న ఆడపిల్లని మీరు మీ ఇంటికి తెచ్చుకొని ఆదరించారు. మీ లాంటి సహృదయులు దొరికే వరకూ రాధ కూడా చదువుకుంటుంది. కాదనకండి.

వరం : సరే. నువ్వు చదువుకొన్న దానివి, మంచిచెడ్డలు తెలిసిన దానివి, నీ ఇష్టం,

కళ్యా : ఇంక ఇల్లు బేరానికి పెట్టకండి. ఇవాళే పెళ్ళి వారికి ఉత్తరం రాసేయండి. మరో విషయం.

వరం : ఏమిటమ్మా ?

కళ్యా : నే నివాళ్టినుంచే ఉద్యోగంలోకి వెళ్తాను.

వరం : నువ్వా ?

కళ్యా : నేనే మామయ్యా? ఈ ఇంటి కష్టాల్ని పంచుకొనే హక్కు పెద్ద కొడుక్కు ఉన్నట్టే, చేతనయినప్పుడు పెద్ద కోడలుకూ ఉంది. ఏమీ చదువుకోని అలివేలు సలహా మీ కంత ఉపయోగించినప్పుడు, నా చదువు మీకు ఉపయోగించకూడదా మావయ్యా -

వరం : తల్లీ. నిన్ను ఈ ఇంట్లో ఎవరూ అర్థం చేసుకోలేదమ్మా. నీ కంత మనస్సు ఉండడమే నాకు చాలమ్మా- ఈ పెధవ బ్రతుక్కి నీ చేత ఉద్యోగం చేయించే గతి వద్దు నాకు. వద్దు తల్లీ.

కళ్యా : అలాఅనుకోకండి.మీరుఅవునంటే నాకు వరం యిచ్చినట్టే. ఆయన కూడా అంగీకరించారు. మీరు కాదంటే బాధపడతాను. నన్ను నిరుత్సాహ పరచకండి మీ కాళ్ళు పట్టుకుంటాను.

వరం : సరేనమ్మా. నీ యిష్టం. నీ మంచి తనానికి దేవుడే అండగా నిలుస్తాడు. మంచిదమ్మా

(కళ్యాణి రాధకి పాఠం నేర్పుతోంది)

కళ్యా : తన కోపమే తన శత్రువు.

రాధ : తన కోపమే తన శత్రువు,

కళ్యా : తన శాంతమె తనకు రక్ష ;
దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము;
తన దుఃఖమె నరకమండ్రు; తధ్యము సుమతీ....
ఏదీ చదవమ్మా.

రాధ : (రాగయుక్తంగా పద్యమంతా అంది)

కళ్యా : భేష్, చాలా బాగుంది. ఈ పద్యానికి నీ గొంతు పూవుకి తావి అబ్బినట్టుంది. నీకు బాగా చదువొస్తుందమ్మా.

దూరంనుంచి శాంతమ్మ : తను చెడ్డ దేవదు వనమంతా చెరిచినట్టు తను పాడయింది చాలక దాన్నీ చెడగొడుతోంది ఏదో పగ పట్టినట్టు. ఆఖరికి నాకు చెయ్యి సాయం కూడా లేకుండా చేస్తుంది గావును, ఈ చదువు లెక్కడ వచ్చిపడ్డాయిర భగవంతుడా. రాధా. ఓ రాధా.

రాధ : ఉండమ్మా చదువుకొంటున్నాను. తరువాత పద్యం చెప్పు వొదినా.

కళ్యా : అమ్మకీ సహాయం చెయ్యమ్మా - పెద్దవాళ్ళ శాపం మంచిది కాదు. వెళ్ళి పని చూసిరా.

రాధ : నీ కున్న విచక్షణ అమ్మకుంటే ఎంత బావుణ్ను వొదినా. (వెళ్ళి) ఎందుకమ్మా కేకలు వేస్తావు?

శాంత: వచ్చావా తల్లీ చదువుల సరస్వతీ- నా పిలుపు అప్పుడే నీ చెవులకి కేకయిందా? అయిపోయింది. అయిపోయింది. నువ్వూ చెడిపోయావు. ఆఖరికి-విన్నూ ఎందుకూ పనికి రాకుండా చేస్తోంది.

రాధ : ఎందుకమ్మా అనవసరంగా వొదిన ననుకొంటావు? మన కోసం మన సుఖం కోసం వదిన యివ్వాళ్టినుంచీ ఉద్యోగానికి వెళ్తోందమ్మా.

శాంత: ఏమిటి. ఉద్యోగానికి బయలుదేరిందీ? ఆఖరికి ఈ చదువులు ఆడవాళ్ళని బాధిన పడేశాయన్నమాట- అయిపోయింది. బ్రతుకులు కుక్కలు చింపిన విస్తర్లు అయిపోయాయి! రామచంద్రా. రామచంద్రా.

(గ ది లో)

ఇంకా ఇక్కడికి శాంతమ్మ మాటలు వినిపిస్తున్నాయి. రాజారావు వచ్చాడు.

రాజా : ఏమిటీ? అమ్మ దీవెనల పల్లవి మార్చింది. నువ్వు ఉద్యోగం చేస్తున్నావంటుందేమిటీ?

కళ్యా : అవునండీ హోంసైన్స్ ఉద్యోగం దొరికిండి. చేరాను.

రాజా ; నువ్వా.

కళ్యా : అవును నేనే. నేనేం చేసినా కాదననని మాటిచ్చారు, గుర్తుంచుకోండి.

రాజా : ఎందుకు చేరావు? అసలు యింత త్వరగా నీకు ఉద్యోగం ఎవరిచ్చారు?

కళ్యా : నేను చదువుకొన్నప్పుడు రుక్మిణి అని క్లాసు మేటు ఉండేది. ఆవిడే యిప్పుడు హోం సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్. నా సంగతి విని వెంటనే చేరమంది. మిగతా వివరాలు తను చూసుకొంటానంది.

రాజా : ఊఁ....రెండో ప్రశ్నకి జవాబు-ఎందుకు చేరావు?

కళ్యా : అదిప్పుడు చెప్పను. ఉన్నదక్కండి.

రాజా : కాని ఈ ఇంటికోసం నువ్వు కష్టపడడం-

కళ్యా : నా ఇంటికోసం నేను కష్టపడడం తప్పా, పోనీ నా డబ్బు మీకివ్వను. సరా. మాటిచ్చారు. మరచిపోకండి.

రాజా : నువ్వు భలేదానివి కల్యాణీ. ఒక్కోసారి 'నువ్వు నాకు తెలుసా?' అని ఆశ్చర్యపోతూంటాను.

కళ్యా : 'అన్‌హర్డ్ మెలొడీస్ ఆర్ స్వీటర్' -నన్నలాగే ఉండనివ్వండి.

(అలివేలు కళ్యాణి గదిలోకి వచ్చింది)

అలి . వదినా. వదినా.

క . ఎవరూ ?

అలి . నేనమ్మా. అలివేలుని- అన్నయ్య కాలేజికి వెళ్లాడా ?

క . ఆఁ.... ఇంక నేనూ బయలుదేరాలి. అదేమిటి పలక తీసుకువచ్చావు?

అలి . ఈ అక్షరాలు సరిగ్గా రాశానో లేదో చూడమ్మా ఒక్కసారి (సిగ్గుతో)

క . (వాటిని చూసి పక్కున నవ్వింది)

అలి . నన్ను చూసి నవ్వ నక్కర్లేదు లేమ్మా, నాన్నగారు చదివించలేదు కాని, నాకూ చదువొచ్చేదే.

క . [ఆమాటకి కళ్ళ నీళ్ళ పర్యంతం అయి]అదికాదు వదినా? ఇప్పుడు చదువు మొదలెట్టావేమిటని నవ్వొచ్చింది. నిజానికి యింతమంచి పిల్లల్తో, యింత తక్కువ జీతంతో మా అన్నయ్యా నువ్వూ యింత నవ్వుతూ ఎలా బ్రతకగలుగుతున్నారో నీ దగ్గర నేను నేర్చుకోవాలమ్మా.

అలి . ఎందుకమ్మా. కష్టానికి తలవొంచడం, అవసరాన్ని గడుపుకుపోవడం మా సంసారాల్లో తప్పవు. రాను రాను కుటుంబం పెరుగుతోంది. జీతం రెండు వందలూ చాలడం లేదు. పిల్లలకి రెండు పూటలా కడుపారా తిండి పెట్టలేక ఇద్దరం కటకటలాడిపోయిన రోజులున్నాయమ్మా- ట్రైయినింగూ లేదు ఏమీలేదు. ఆయన కయినా ఈ బాధ తప్పిద్దామని రెండు నెలలు ముందుగానే వచ్చేశాను.

క . (కళ్ళనీళ్ళతో) మరి అన్నయ్యకి యిదంతా ఎందుకు చెప్పలేదమ్మా-

అలి . ఏమని చెప్పను వొదినా. కడుపు చించుకొంటే కాళ్ళమీద పడుతుంది. నాన్నగారు మాత్రం ఎంతకాలం సాకుతారు? జీవితమంతా ఉండే అవసరాల్ని ఎవరు తీరుస్తారు? మనమే ఎదుర్కోవాలి? మనమే తీర్చుకోవాలి. మన దుఃఖాన్ని-ఒకరికి పంచదలచినా పంచుకోరు. సుఖాన్ని పంచుంకుటారు. అందుకనే కడుపు ఏడుస్తున్నా పెదవి నవ్వుతుందమ్మా.

క . వొదినా? ఎంత గొప్ప సత్యం చెప్పావమ్మా. చదువొక్కటే నేర్పని గొప్ప సత్యం నీకు జీవితం నేర్పింది. బాధపడకు. చదువే కాదు. నీ సంసారం ఒక మార్గం పట్టించే భారం నాది.

అలి : వొదినా, నిన్ను కట్టుకొన్నందుకు అన్నయ్యకే కాదు - ఈ కుటుంబానికే అదృష్టం పట్టింది. వస్తా - [వెళ్తూ ఆగి-అంతలో నవ్వి] నేను చదువుకొంటున్నానని అన్నయ్యతో అనకేం? నవ్వుతాడు.

క . అలాగే.

కొన్ని నెలల తరువాత

పరం . అబ్బాయి పుట్టాక నెల తిరగకుండానే తీసుకు వెళ్ళి పోతున్నావు.

సుబ్బ . ఎన్నాళ్ళున్నా ఉండాలనే అనిపిస్తుందండి. ఫ్యాక్టరీకి వంటకీ కుదరక ఇబ్బందిగా ఉందండి. ఈసారి సంక్రాంతికి కాస్త ముందుగా వస్తాను.

పరం . మంచిది బాబూ. పిల్లలు జాగర్త.

గదిలో.

అలి . వస్తాను వదినా?

క . ఇంత త్వరగానే వెళ్ళిపోతున్నావమ్మా.

అలి . ఆయన ఒక్కరూ ఏ పనీ చేసుకోలేరమ్మా ప్రతి దానికీ నేను ఉండాలి.

క . బీసరికంలో ఎంత ఆప్యాయత ఉందమ్మా. వెయ్యి రూపాయలిస్తాను. ఈ ఆప్యాయతలకి రహస్యం చెప్ప కూడదు?

అలి . పో వదినా. నేనంటే పరిహాసం నీకు.

క . కాదమ్మా - జీవితాన్ని గురించి పాఠాన్ని నువ్వే నేర్పావు. మా మేనల్లుడు పుట్టి నీ చదువు పాడుచేశాడు. ఈసారి వచ్చినప్పుడు బాగా చెప్తాను.

అలి . వస్తా నొదినా.

క . శుభం - అదేమిటి నాకు నమస్కారం చేస్తావు? లేలే.

అలి . నువ్వు నా కన్నా అన్నివిధాలా పెద్దదానివి. నేను మళ్ళీ వచ్చేసరికి ఈ ఇంటిని స్వర్గం చేస్తావు. నాకు తెలుసు.

.... .... ....

రాధ . అమ్మా. అమ్మా.

శాంత . ఏమే.

రాధ . అక్కని సాగనంపుతూ వదినె రెండు చీరెలు కొని చ్చిందమ్మా.

శాం . డబ్బెక్కడిదే.

రాధ . తన జీతంలోనే కొంది.

శాం . [ఆశ్చర్యంగా] నువ్వు చూశావుటే.

రాధ . నేను స్వయంగా చూస్తే. అక్కయ్య కళ్ళు తుడుచు కొంటూ వదిన గదిలోంచి చీరెలు పట్టుకు వెళ్ళింది.

శాం . [ఆలోచనలో పడి] అలాగా? - చెడ్డవాళ్ళలోనూ మంచి తనం ఉంటుంది కాబోలు.

రాధ . [నవ్వి] మంచివాళ్ళలో చెడు ఉన్నట్టె.

శాం . ఎవరే ఆ మంచివాళ్లు?

రాధ . నువ్వు.

శాం . నాలో చెడు ఉందా - భడవా [ముసి ముసి నవ్వుల్తో రాధ పారిపోయింది]

వృద్ధ దంపతులు -

పరం . చూశావుటే. రాధని పరీక్షలమీద పరీక్షలు పాసు చేయిం చేస్తోంది కోడలు. అందులో సగం పట్టుదల నా కుంటే తాసీల్దారుచేసి రిటైరయే వాడిని.

శాం . పాసు చేయించడ మేమిటి - మా రాధ తల్లి పాసవుతోం దనండి. దానికి తెలివి తేటలున్నాయి కనక రాణింపుకు వచ్చింది. లేకపోతే చిల్లి పెంకు బంగారమవుతుందా ఏమిటి?

పరం . నీ మెదడు తిరగేసి అతికించాడే దేవుడు. కింద పడినా గెలుపు నీదే అంటావు.

శాం . ఎదుటివాడు గొప్పవాడనుకోబట్టె మీరు గుమాస్తా గిరిలోనే ఉండిపోయారు.

పరం . [నవ్వుతూనే] ఎదుటివారు వెధవనుకొని నువ్వు మాత్రం ఆ వంటగది దాటి బయట రాగలిగా వేమిటి? ఎంత చెట్టుకి అంత గాలే- నా కొడుకు మంచివాడు!-నా కోడలు బుద్ధిమంతురాలు. నా కూతురు తెలివయినది. ఇన్ని వున్నాక నా పెళ్లాం గయ్యాళి తనాన్ని భరించగలనులే.

శాం . చాల్లెండి. పిల్లలకి వినిపిస్తాయి మీ కేకలు.

పరం : సిగ్గుపడడంలో అందం అరవై ఏళ్ళొచ్చినా పోలేదే నీకు [నవ్వుకున్నాడు.]

.... .... ....

[హఠాత్తుగా రాధ పేపరు చేత బుచ్చుకొని

ఇంట్లోకి పరుగెత్తు కొచ్చింది]

రాధ . అమ్మా. నేను పరీక్ష పాసయానమ్మా - నాన్నా పరీక్ష పాసయాను. బికాం రిజల్ట్సు ఇవాళ పేపర్లో వచ్చాయి - ఇదిగో ఫస్టు క్లాసులోనే నంబరు వుంది.

పరం : చాలా సంతోషం తల్లీ. మొత్తంమీద కష్టపడి సాధిం చావు.

శాం . ఏమిటే రాధా.

రాధ . నేను పరీక్ష ప్యాసయానమ్మా. ఇదిగో.

శాం . నా తల్లే. నా తల్లే. ఎంత చల్లని వార్త చెప్పావమ్మా. ఉండు వస్తాను.

పరం . వదినకి, అన్నయ్యకి చెప్పమ్మా.

రాధ . వాళ్ళింకా ఆఫీసు నుంచి రాలేదు నాన్నా. అదిగో అన్నయ్య మాటలోనే వచ్చాడు. అన్నయ్యా! - నేను ప్యాసయ్యాను.

రాజా . నాకు తెలుసునమ్మా -

రాధ . ఎలా తెలుసు? పేపరు చూశావా?

రాజా . లేదు,

రాధ . మరెలా తెలుసు?

యువ పాఠకులకు

# దీపావళి శుభాకాంక్షలు

# ఏషియాటిక్ ట్రేడర్స్ (రిజిష్టర్డు)

హెడ్ ఆఫీసు :
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్,
విజయవాడ-2
ఫోన్ : నెం. 6365

బ్రాంచి :
సుల్తాన్ బజార్,
హైదరాబాదు-1
ఫోన్ : నెం. 42137

డిస్ట్రిబ్యూటర్లు .

యాబట్ లేబరేటరీస్ (ఇండియా) ప్రై|| లిమిటెడ్: బొంబాయి-1

డాల్ఫిన్ లేబరేటరీస్ ప్రై|| లిమిటెడ్ : కలకత్తా-20

జాన్సన్ అండ్ జాన్సన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ : బొంబాయి-26

రాజా . నీ పట్టుదలా, మీ గురువుగారి పట్టుదలా చూసి అను కొన్నాను. ఫస్టుక్లా వచ్చిందా?

రాధ . ఓ.

రాజా . మరి మీ గురువుగారికి చెప్పావా?

రాధ . ఇంకా వదినె రాలేదన్నయ్యా.

కళ్యా . (అప్పుడే వచ్చింది నాకూ తెలిసిపోయింది రాధా.

రాధ . వదినా.

క . ఆఫీసులోనే పేపరు తెప్పించి చూశాను. ఇంద.

రాధ . ఏమిటి? కలమా? ఇదేమిటి?

క . పాసయినందుకు నీకు ప్రెజెంట్.

రాధ . బాగుంది వదినా. పాసు చేయించి నందుకు నేనే నీకు ఋణపడి వున్నాను.

శాం . రాధ. రాధా. ఇదిగో మ్మా.

రాధ . ఏమిటమ్మా అది?

శాం . పాయసం.

పరం . కూతురు పాసయిందని తెలిసి యింకా క్షణం కాలేదు అప్పుడే పాయసం ఎలా చేసేశావే?

శాం . చాల్లెండి మీ వేళాకోళాలు. ఇవాళ శ్రావణ శుక్రవారం. మరచిపోయారా ఆ గ్లాసు కల్యాణి కివ్వమ్మా.

రాజా . (నెమ్మదిగా) చూశావా? ఇవాళ అమ్మ దగ్గరే క్రెడిట్ కొట్టేశావ్? ప్రథమ తాంబూలం నీకే.

క . (నవ్వి) ఊరుకోండి - అక్కడేనేమిటి. - (రాధతో) చూడు రాధా. మొన్న బ్యాంకులో మా స్నేహితురాలితో చెప్పి వుంచాను. వాళ్ళకో స్టెనోగ్రాఫర్ కావాలట. ఇవాళే అప్లికేషన్ రాసి పంపాలి. ఫారం కూడా తీసు కొచ్చాను.

రాజా . అప్పుడే ఉద్యోగమే.

క . ఇంక ఆలస్యం దేనికి (దగ్గరికి వంగి) గుర్తుంచుకోండి. మాటిచ్చారు.

రాజా . సరే. నోరెత్తను.

క . ఒక్కసారి రా రాధా ఈ పని పూర్తి చేద్దాం.

పరం . భగవంతుడా. యీ ఇల్లు కళ కళ లాడుతుండగా ఇన్నా ళ్ళకి చూశానయ్యా.

బయటి నుంచి టెలిగ్రాం అన్న కేక)
చూడు బాబు. ఏదో టెలిగ్రామట

శాం . ఏమిట్రా అది?

రాజా . (కవరు చించి చదివి) బావ! (అన్నాడు భయ కంపితుడయి)

| | |
|---|---|
| పరం . బావకేమయిందిరా? | ఒక్కసారి. |
| శాం . ఏమిట్రా అది? | |
| క . ఏమయిందండీ? | |

రాజా . ఫ్యాక్టరీలో ఏదో ప్రమాదం జరిగి బావ పోయాడటమ్మా.

(అంతా ఒక్కసారి "అఁ...." అన్నారు)

రాధ . అమ్మా! అయ్యో! అమ్మకి ముఖం తిరిగింది అన్నయ్యా. (కేకలేసి ఆమెను చేతిలోకి తీసుకొంది)

పరం . భగవంతుడా. ఆనందాన్ని చూపినట్టె చూపి మళ్ళీ దుఃఖంలో పడేశావా తండ్రీ.

కళ్యా . (దుఃఖాన్ని దిగమింగుకొని) ఏమండీ? వెంటనే వెళ్ళి అలివేలు, పిల్లల్ని వెంటబెట్టుకురండి ఇంక ఆలస్యంచెయ్య కండి, ఆలశ్యం చేస్తే అలివేలుకి ప్రమాదం రావచ్చు. వెళ్ళండి.

రాజా . అలాగే కళ్యాణీ ఇప్పుడే బయలుదేరుతాను.

(అలివేలు పిల్లల్తో తిరిగి వచ్చింది. దుఃఖంలో కృంగిపోతున్న ఆమెను కళ్యాణి ఓదారుస్తూ-)

క . ఊరుకో అలివేలూ. ఊరుకో.

అలి . వదినా. నాకింత అన్యాయం జరిగిపోతుందనుకోలేదు వదినా.

క . మనం ఏం చెయ్యగలం చెప్పు. ఇలాంటి సమయంలో దిగులు పడితే పిల్లలు మరీ బెంబేలు పడతారమ్మా. మనస్సు నిలదొక్కుకో.

అలి . భయం కాక నాకేముందమ్మా. ఈ పిల్లల్తో ఎలా బ్రత కాలో ఆలోచిస్తుంటేనే భయంగా వుంది. గుట్టు మట్టుగా సాగిపోయే సంసారం. ఇలా బజారున పడుతుంది.

క . మేమంతా వుండి అలా ఎందుకు జరగనిస్తాం అలివేలూ.

అలి . వదినా. క్రితంసారి నీ మాటల్తోనే కొండంత ధైర్యం వచ్చింది. ఈ సారి పండక్కి కాస్త పెందరాళె వచ్చి నీ దగ్గర పాఠం చెప్పించుకోమని ఆయనా ప్రోత్సహిం చారు. కాని కష్టాలన్నీ ఆయనే పంచుకొని వెళ్ళి పోయారు.

క . కన్నీరు కార్చకు. ఇలాంటప్పుడు పరిస్థితుల్ని తట్టుకోవ డమే తట్టుకోవడం. పోయే వాళ్ళతో మనమూ పోలేం. చూడమ్మా. ఈ పిల్లలందరికీ నువ్వే అండగా నిలవాలి. వాళ్ల తండ్రిలేని లోటు కూడా నువ్వే తీర్చాలి.

అలి . చదువూ సంధ్యా లేనిదాన్ని నేనేం చెయ్యగలనమ్మా.

క . తలుచుకుంటే నువ్వే చెయ్యగలవు. మనసుంటే తప్పక మార్గముంటుంది అలివేలూ. ఎవరి ముందూ చెయ్యి జాపే అగత్యం లేకుండా చేస్తాను.

అలి . వొదినా ఈ కష్టంలో నువ్వే నాకు వెలుగు చూపుతున్నా వమ్మా. నీ పేరు చెప్పుకు నా పిల్లలంతా జీవిస్తారు. ఏ లోకంలో ఉన్నారో ఆయనా నిన్ను దీవిస్తారు.

క . దానికేంలే....ఇంక ఊరుకో.

ఆ సాయంకాలం :

క . అలివేలూ. అలివేలూ.

అలి . ఏం వొదినా. కాలేజీనుంచి వచ్చేశావా?
క . (తనతో ఏదో పట్టించుకు వచ్చింది. వచ్చిన కూలీతో అంది) దాన్నిక్కడ దింపవోయ్
అలి . ఏమిటమ్మా అది?
క . నీకే అలివేలూ. కుట్టు మిషను.
అలి . వదినా. యిదెందుకూ నాకు?
క . ఏదో పనిలో పడితే కొంతవరకు బాధల్ని మరచిపోతావు అలివేలూ. తీరికగా కూర్చున్నప్పుడల్లా నువ్వు పిల్లలకి బట్టలు కుట్టడం గమనిస్తూనే వున్నాను.
అలి . (దిగులుగా) ఇంత సంసారం. గడుస్తుందా వదినా.
క . దానికి సిగ్గు పడవలసింది లేదమ్మా. నీ పని, నీ పిల్లల పని నువ్వు చూసుకొంటున్నావు.
అలి . ఇంతో టిపనికి కుట్టుమిషన్ ఎందుకమ్మా.
క . అవసరమయితే మీ అన్నయ్య బట్టలు కుట్టిపెట్టవా? నాకు సహాయం చెయ్యవా?
అలి . అదేమిటి వదినా? ఎందుకు చెయ్యను? నేను యింతకన్నా చేసేదేముంది? అలాగే చేస్తాను
కళ్యా : ఈ దుఃఖంలో చదువుమీదకన్నా ఇంటిమీద ఏకాగ్రత సులువుగా కుదురుతుంది. ఇవాళే ప్రారంభం. ఊఁ. మిషన్‌ముందు కూర్చో.
అలి : [నవ్వి] నువ్వు తెలివయినదానివమ్మా - బట్టలు కుట్టుకొనే చిన్న అలవాటుకి ఇంత అందమయిన రూపు దిద్దావు.
క : కృతజ్ఞతలు తర్వాతలే. అసలు సంగతి మరిచిపోయాను. ఇవాళ్టినుంచీ రాధ ఉద్యోగంలో చేరింది. బ్యాంక్ ఏజెంట్ దగ్గర స్టెనోగ్రాఫర్. జీతం నూట యాభై.
అలి : అలాగా. చాలా సంతోషం వదినా.

.... .... ....

[కుట్టు మిషన్ పని చేస్తోంది]

రాధ : [లోపల్నుంచి అరిచింది] ఆఫీసుకు వేళయిపోయింది. నా బ్లౌజ్ అయిందా అక్కా.
అలి : ఇదిగో రాధ.
రాధ : ఎంత బాగా కుట్టావక్కా. ఎలా వుందక్కా.
అలి : పెద్ద ఆఫీసరు భార్యలాగ వున్నావే.
రాధ : పో అక్కా.
అలి . నిజంగానే రాధా! నీలో మార్పు చూస్తే ఆశ్చర్యమేస్తోంది.
రాధ . సరేలే. నాకు వేళయింది బాబూ. వస్తా.
రాజా . చెల్లాయ్. నా బుష్‌కోటుకి గుండీలు వేశావా?
అలి . ఇందాకే అయిపోయిందన్నాయ్యా.
రాజా . ఏదీ? వండర్‌ఫుల్. నీ కింత మంచి ఆర్టు వుందని ఇది వరకు చెప్పలేదేమమ్మా.
అలి . [నవ్వి] నాకు తెలుస్తేగా?
రాజా . ఓహో. అర్థమయిందిలే. [నవ్వి] నువ్వు మళ్ళీ చిరునవ్వు నవ్వగా ఇన్నాళ్ళకి చూస్తున్నానమ్మా. కానీ .... నీ పనికి అడ్డురాను.
పరం . అమ్మా. అలా వీధిలోకి వెళ్ళిరావాలి. నా కండువాకి కుట్టు వేస్తావా?
అలి . అలాగే నాన్నా -
పరం . వీళ్ళంతా ఆఫీసులకి బయలుదేరారా?
అలి . అన్నయ్య ఇప్పుడే వెళ్లాడు.
శాం . [లోపల్నుంచి] ఏమండోయ్. ఒక్కక్షణం ఆగండి. రాధకి కారేజీ ఇస్తాను. దారిలో ఇచ్చి వెళ్ళరుగాని.
పరం . [నవ్వుకొని] అలాగేలే. చూశావమ్మా. చదువులూ, ఉద్యోగాలూ అంటే రుసరుసలాడే అమ్మకూడా మెల్లగా పరిస్థితులకు రాజీ పడుతోంది. రోజు రోజూ ఈ ఇంట్లో వచ్చే మార్పు చూస్తుంటే ఆశ్చర్యంగా వుంది.
అలి . ఇదిగో నాన్నా నీ కండువా.

.... .... ....

రాధ . వదినా. రాసుకుంటున్నావా?
కళ్యా . ఏం రాధా. ఇంత రాత్రిదాకా మేలుకున్నావ్.
రాధ . కొంచెం ఆఫీసు పనివుంటే చూస్తున్నాను వదినా. వదినా? ఓ చిన్న విషయం.
క . ఏమిటి రాధా అది?
రాధ . మా ఆఫీసులో ఒక టైపిస్టు వుంది. వాళ్ళ నాన్న మొన్న యుద్ధంలో పోయారు. పెద్ద సంసారం. ఆ అమ్మాయి తెచ్చే జీతం చాలక బాధపడుతున్నారు. అక్కయ్య సంగతి మధ్యలో అన్నాను వదినా. వెంటనే, "మా అమ్మకి కుట్లూ, అల్లికలూ వచ్చుంది" ఆ అమ్మాయి
క . అలాగా.
రాధ . నేను చదువుకొనే రోజుల్లో సుగుణ అని వుండేది. ఎస్. ఎస్. ఎల్. సీ. దాకా చదువుకొంది. ఆ అమ్మాయిని భర్త వదిలిపెట్టి ఎక్కడికో పారిపోయాడు. ఆ అమ్మాయి చాలా తెలివయింది వదినా. కాని దురదృష్టవశాత్తు అన్యాయం జరిగిపోయింది.
క . [నవ్వి] మన మనుకొన్న న్యాయం మన మనుకొన్నట్టు జరగదమ్మా. కష్టాలోంచే సుఖాల్ని వెతుక్కోవాలి. బాధల్లోంచే మంచి బ్రతుక్కి బాటలు వేసుకోవాలి. అలాగే.... చూద్దాంలే.
రాధ . సరే వదినా.

[రాత్రి]

రాజా : అవును కళ్యాణీ. నీటిలో మునిగేవాడు, ఆ కష్టాన్ని తట్టుకోవడాన్నే ఆలోచిస్తాడు కాని తప్పించుకోవడాన్ని ఆలోచించలేదు. అది బయట నిలబడ్డ వాడే చెయ్యాలి.
క : ఏం. మీకు తెలిసిన వాళ్ళు చాలామంది వున్నారా?

రాజా : లేకేం! మార్గమే ఉండాలి కాని, కృతజ్ఞతతో అనుసరించే వాళ్ళు వందలున్నారు. మా కాలేజీ ప్యూన్ మత్తుగా తాగుతాడు. వాడి జీతమంతా తాగేస్తాడు. అది వాడికివ్వద్దని భార్య వచ్చి ప్రిన్సిపాల్‌తో మొర పెట్టుకోవడం పదిసార్లు చూశాను. నువ్వు దారి చూపితే ఆవిడా కలసి వస్తుందని నా ఉద్దేశం.

క : ఇదంతా చూస్తూంటే నాకు ఆలోచన వస్తోందండీ.

రాజా : నీకు రాకపోతే మాకు వస్తాయి. మా అందరికీ నిన్ను పొగడడంతోనే సరిపోతోందాయె.

క : చాల్లెండి మీ పరిహాసాలు. చూడండి. వీళ్ళందరూ ఏకమయి కలసికట్టుగా పనిచేస్తే.

రాజా : అంటే.

క : ఆడవాళ్ళంతా కలసి కుట్టు మిషన్లమీద పనిచేస్తారనుకోండి.

రాజా : అన్ని మిషన్లేవి!

క . వాయిదాలమీద తీసుకుందాం.

రాజా . డబ్బేది!

క . నేనిస్తాను.

రాజా . నువ్వా!

క . నా జీతం ఏం చేస్తున్నానని ఒక్కరోజయినా అడిగారా!

రాజా . అడగొద్దని నువ్వు శాసించావుగా!

క . ఇప్పుడు అడగండి. బ్యాంకులో వుంది. ఇవాళే రాధకి చెక్కు రాసి యిస్తాను. వాళ్ళ బ్యాంకులోనే ఎకౌంట్. మీరలా కాలేజీనుంచి మా కాలేజీకిరండి. ఇద్దరం వెళ్లి మిషన్లు బేరం చేసి వద్దాం.

రాజా : ఉండుండు. తొందరపడకు. వాళ్ళందర్నీ ఎక్కడ పోగు చేస్తావు? ఎవరి బట్టలు కుడతారు? కుట్టిన వాటినేం చేస్తారు? - ఇదంతా ఆలోచించుముందు.

క : (నవ్వి) అది మీ బాధ్యత. మంచి ఇల్లు చూసి పెట్టండి. ఒక్క "కో-ఆపరేటివ్"గా అంతా కలుస్తారు. బట్టలు కుడతారు. వాళ్ళే అమ్ముతారు.

రాజా : అంతా మహిళా సంఘమన్నమాట. లేడీస్ కో ఆపరేటివ్. కళ్యాణీ.

క . ఏమిటండీ.

రాజా . ఇంత బృహత్తర ప్రణాళిక వేశావు కదా? ఎంత దాచావేమిటి!

క . ఆరువేలు చాలా!

రాజా . వదవాలేమ. ఆ డబ్బుతో ప్రారంభం చెయ్యొచ్చు.

క . (నవ్వి) మీరు మరిచిపోతున్నారు. వాళ్ళ ఉత్సాహంతో ప్రారంభమయిన సంస్థను మనం కూడదీస్తున్నాం. సాయంకాలం అటు వెళ్ళడం మరిచిపోరుగా.

రాజా . మాటిచ్చానుగా! - తప్పుతుందా మరి.

.... ... ....

[బ్యాంకులో పాత ఏజెంటు బదిలీ సమయంలో వీడ్కోలు విందు జరిగింది. ఆ విందుకి కొత్త ఏజెంటు కూడా హాజరయాడు. అంతా చప్పట్లు కొట్టారు]

పాత ఏజెంట్ : థ్యాంక్యూ మిస్టర్ శంకరం. మీకు చార్జీ ఇచ్చే ముందు ఒక్కసారి ఈ బ్రాంచి స్టాఫ్‌ని పరిచయం చేస్తాను. ఈయన ఎకౌంటెంట్ రఘురామారావుగారు. (నమస్కారాలూ ప్రతి నమస్కారాలూ జరుగుతున్నాయి) ఈయన కేషియర్ - కోటేశ్వరరావుగారు - ఈయన హెడ్‌క్లార్క్ నాగభూషణంగారు, ఈయన శర్మ, ఈవిడ కౌసల్య - వీళ్ళిద్దరు గుమాస్తాలుగా ఉంటున్నారు. ఈవిడ....

రాధ . [ఆయన మాట పూర్తి కాకముందే] నమస్కారమండీ.

శం . నమస్కారం.

పా. ఏ . మీ పర్సనల్ స్టెనో. ఏక్టివ్ గర్ల్. చాలా చక్కగా పని చేస్తుంది.

శం . (నవ్వి) చాలా చక్కగా పాడుతుంది కూడాను.

పా.ఏ . మీకెలా తెలుసు.

శం . నా కిదివరకే తెలుసులెండి.

పా ఏ . అలాగా - ఐ యామ్ గ్లాడ్.

ప్యూ . మీకు ఫోన్ వచ్చింది సార్.

పా.ఏ . అలాగా. ఎక్స్‌క్యూజ్‌మీ మిస్టర్ శంకరం (వెళ్తాడు)

శం . మీరు రాధ కదూ!

రాధ . అవునండి. కాని.... నేను మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదే.

శం . (నవ్వి) దానికేం నేనేం చెయ్యను! అది మీ పొరపాటు. కాని నేను ఒకరోజు మిమ్మల్ని చూడడానికే మీ యింటికి వచ్చాను. మీరప్పుడు నన్ను చూడలేదేమో. కాని ఆ రోజు మిమ్మల్ని చూశాను. మీ పాట విన్నాను. మీ నాన్నగారు బాగున్నారా!

రాధ . ఆc.

శం . మీ అన్నయ్య ఆ రోజు నా సెన్సాఫ్ హ్యూమర్‌కి పగలబడి నవ్వడం నాకింకా గుర్తుంది. ఏం! యిప్పటికయినా గుర్తుపట్టారా!

రాధ . లేదండి. ఇంకా జ్ఞాపకం రావడంలేదు.

శం . అయిదేళ్ళ క్రిందట - మీకు పెళ్ళికాకముందు - నేను పెళ్ళి చూపులకి వచ్చాను.

రాధ . [నవ్వి] నా కింకా పెళ్ళికాలేదులెండి.

శం . అలాగా! ఐయామ్ గ్లాడ్.

రాధ . [ఆశ్చర్యంగా] ఆc.

శం . ఐయామ్ సారీ. మాట వరసగా అనేశాను. అయినా అయిదేళ్ళలో ప్రపంచం అంతా మారిపోయి ఉంటుందనుకోవడం నాదే పొరపాటు. ఇవాళ మిమ్మల్ని కలిస్తే ఆ పాత విషయాలన్ని గుర్తుకొస్తున్నాయి. నాకూ ఇంకా పెళ్ళి కాలేదు. [దిగులుగా, చిన్న పిల్లాడిలాగా చెప్పాడు]

రాధ . [నవ్వేసింది]

శం . నవ్వొస్తోందా మీకు — పూలిన్. అ రోజుల్లో మా నాన్న గారి ఆశకి నాకూ నవ్వొస్తోంది ఇప్పుడు. అన్నట్టు అప్పుడు మీరు థర్డుఫారం చదువుతున్నారని—

రాధ . అవునండి. తరువాత చదువుకొన్నాను. బి. కాం. పాస యాను, టైప్ షార్టుహ్యాండ్ పరీక్షలు ప్యాసయాను.

శం . వండర్‌ఫుల్. పట్టుదల అలా వుండాలి. ఆడది బాగుపడ డానికి, మగాడు చెడిపోడానికి కంకణం కట్టుకొంటే ఎవరూ అడ్డు నిలవలేరని మా కవి మిత్రుడు అంటూండే వాడు. మీ రిప్పుడెంతో అందంగా ఉన్నారు!

రాధ . [ఆశ్చర్యంగా] ఏమిటీ.

శం . ఐయామ్ సారీ. అంటే — నాకు చెప్పడం చాతకాలేదు. ఐ మీన్ — యు ఆర్ వెరీ ఎట్రాక్టివ్ — ఈ మార్పు మీలో చాలా బాగుందని నా ఉద్దేశ్యం, ఐ యామ్ సారీ.

[ఇంటి దగ్గర]

రాధ . [గుక్క తిప్పుకోకుండా నవ్వుతోంది]

అలి . ఎందుకే అంత నవ్వు!

రాధ . మా బ్యాంకుకి కొత్త ఏజెంటు వచ్చారక్కా!

అలి . వస్తే!

రాధ . ఆయన భలే తమాషాగా మాట్లాడుతారు. మాటకి ముందు "ఐయామ్ సారీ" అంటూ. ఆయనకి తెలుగు మాట్లా డడం సరిగా రాదు,

అలి . నోర్మూయ్. ఈ మాట మీ ఆఫీసు వాళ్ల దగ్గర అనేవు. ఉద్యోగం పోతుంది.

రాధ . ఆయన్ని చూస్తే నీకే ఆశ్చర్యమేస్తుందక్కా.

అలి . ఆశ్చర్యం ఎందుకే!

రాధ . ఎందుకా! — (ఆలోచించి) తర్వాత చెప్తాలే.

అలి . రాధా! ఏమిటే ఆలోచిస్తున్నావ్!

రాధ , ఆయన చాలా తమాషా అయిన వ్యక్తి [ఆలోచిస్తోంది. ఆలోచన చివర నవ్వొచ్చి- నవ్వుకొని లేచి వెళ్ళి పోయింది]

అలి . పిచ్చిపిల్ల.

క . [అంతలో అటు వేపు వచ్చి] ఏమిటి అలివేలూ ఆలో చిస్తున్నావు!

అలి . రాధ పెద్దదవుతోంది వదినా

క . ఏమయిందిప్పుడు!

అలి . ఈ మాటు అలా బ్యాంకికి వెళ్ళినప్పుడు కొత్తగా వచ్చిన ఏజెంటెవరో కనుక్కో వదినా!

[వది పదిహేను కుట్టుమిషన్లు ఒక్కసారి పని చేస్తున్నాయి. ముందు షోరూం అంతా వచ్చే పోయే కొనుగోలుదార్లతో హడావుడిగా ఉంది]

క : ఏం వొదినా? ఎలా ఉంది మీ కోఆపరేటివ్ యూనిట్.

అలి : చాలా బాగుందమ్మా. ముఖ్యంగా మహిళలంతా కలిసి పని చేయడం మహిళల్నే ఎక్కువ ఆకర్షిస్తోంది. వాళ్లకి ప్రత్యేకంగా ఒక దుకాణం లేని కొరత తీరిపోయిం దంటున్నారు. రోజుకి కనీసం రెండువేల రూపా యల రెడీమేడ్ బట్టలు అమ్ముడు పోతున్నాయి వదినా.

క : వెరీగుడ్. అది సరే. పసిపిల్లలున్న తల్లుల మాటేం చేశారు?

అలి : ఇద్దరు నర్సుల్ని కుదిర్చాం. ఆ గదినిండా పిల్లలే. వెళ్ళి చూడు. చూడ ముచ్చటగా ఉంటుంది.

క : బాగుంది. మహిళా సహకార సంఘానికితోడు ఓ నర్సింగ్ హోం కూడా ఏర్పాటు చేసుకొన్నారన్నమాట.

అలి : మరి పిల్లలుగల తల్లులకి కూడా ఉపాధికి అడ్డురాకుండా చూడాలి కదా వదినా?

క : ఆఁ. చూశావా! ఆలోచన యివ్వాలేకాని, ఎంతలేసి పనులు మీకు మీరే చేసుకుపోతున్నారో.

అలి : అంతా నీ....

క : అదిగో. కదిపితేచాలు. కన్నీళ్ళు కృతజ్ఞతలే పొర్లుకు వస్తాయి. కష్టపడేది మీరూ. గొప్పతనం నా కూనా. అలా అంటే నాకు బాధగా ఉంటుంది.

అలి : [నవ్వి] పోనీ అనునులే. ఎంత లేదన్నా వారానికి 20 వేల రూపాయల వ్యాపారం జరుగుతోంది వదినా.

క : అలివేలూ నువ్వెంత మారిపోయావో తెలుసా!

అలి : నిజంగానా!

క : పరిహాసంకాదు. ఇదివరకు కళ్లల్లో కనిపించే భయం పోయింది. ముఖంలో నీరసం మాయమయింది. కొత్త ఆశతో, కొత్త కళతో ఉన్నావు నువ్వు. నిన్ను చూస్తే నా కెంతో ఆనందంగా ఉంది. అదిగో — కళ్లనీళ్ళు.

అలి : కళ్ళనీళ్ళు కావు వదినా. సంతోషాన్ని చెప్పుకొంటుకు యింతకన్నా మరో మార్గంలేదు నాకు.

క : [ప్రేమతో] అలివేలూ!

[బ్యాంకులో ఏజెంట్ గదిలో బెల్ మోగింది.

రాధ లోనికి వచ్చింది]

రాధ : పిలిచారా సార్!

శం : అవును రాధా [సీరియస్‌గా] డిక్టేషన్ తీసుకో.

రాధ : చెప్పండి.

శం : వెరీ అర్జంట్ లెటర్.

రాధ : ఊఁ.

శం : ఐ వాంట్ టు మెరీ యూ, ఇఫ్ యూ హేవ్ నో అబ్జక్షన్, యువర్సు సిన్సియర్లీ — శంకరం.

రాధ : [మొదట ఆశ్చర్యపడినా] అడ్రసు చెప్పండి.

శం : టు — మిస్ రాధా.

రాధ : [ఆశ్చర్యంగా] శంకరంగారూ!

శం : కోపం వచ్చిందా రాధా. ఐ యామ్ సారీ. జీవితమంతా డిక్టేషన్‌లతో గడిచిపోయింది. ఇంతకంటే ప్రేమలేఖలు

వ్రాయడం నాకు రాదు. మనస్ఫూర్తిగానే అడుగుతున్నాను. నీ కభ్యంతరం లేకపోతే పెళ్ళిచేసుకుంటాను.

రాధ : ........

శం : ఏం? మాట్లాడవు?

రాధ : శంకరంగారూ. నను పెళ్ళిచేసుకుంటె పదివేల రూపాయల కట్నం నష్టపోతారేమో.

శం : మా నాన్న మాటల్తో నన్ను ఎత్తిపొడుస్తున్నావా? అది అన్యాయం.

రాధ : అలాగా? మరి ఈ అభిప్రాయం ఆ రోజు మీకు లేదా శంకరంగారూ.

శం : ఉంది.

రాధ : మరి చెప్పలేకపోయారేం?

శం : నువ్వు నవ్వకపోతే నిజం చెప్తాను.

రాధ : చెప్పండి.

శం : మొదట్నుంచీ అధికారుల ఆర్డర్స్‌కి లొంగి బ్రతకడం అలవాటయిపోయింది. ఆ అలవాటుతో నాన్నగారి ఆర్డర్స్‌ని కాదనలేకపోయాను. పొరపాటుజరిగిపోయింది. ఐ యామ్ సారీ. ఏమంటావు?

రాధ : కొన్ని అభిమానాలకి లొంగి బ్రతకడం నాకూ అలవాటయిపోయింది శంకరంగారూ. వాటిని త్రెంచుకోవడం నా కిష్టంలేదు.

శం : అంటే మీ నాన్నగారి అనుమతి పొందాలనా?

రాధ : కాదు. మా వదిన అనుమతి పొందాలని. ఇవాళ్టి రాధకి కారకురాలు ఆవిడే. మిమ్మల్నే కాదు. ఎవరిని పెళ్ళి చేసుకోననే మాటమీదే నన్నింతదాన్ని చేసింది. ఆవిడని నొప్పించే పని ఏది నేను చెయ్యలేను. నన్ను మన్నించండి. [వెనక్కు తిరిగింది]

శం : రాధా. నా మాట విను.

న్యూ : రాధాదేవిగారికోసం ఎవరో అమ్మగారు వొచ్చారండి.

రాధ : వదిన.

శం : సరే. ఆవిడని యిక్కడికే రమ్మను. కూర్చో రాధా నీ ముందే మీ వదినను అడుగుతాను.

రాధ : నే నుండను. నాకు భయం.

[కళ్యాణి వచ్చింది]

శం : నమస్కారం, రండి.

క : నేను.... నేను.... మా రాధకోసం వచ్చానండి.

శం : పరవాలేదు కూర్చోండి.

క : మిమ్మల్ని.... మిమ్మలెక్కడో చూసినట్టుందే.

శం : చూశారు మీరు. అయిదేళ్ల క్రితం రాధ పెళ్ళి చూపులకి వచ్చాను.

క : అవును. గుర్తొచ్చింది.

శం : అప్పుడో పొరపాటు కూడా చేశాను.

క : ఏమిటి?

శం : రాధని పెళ్ళి చేసుకోక పోవడం. అది దిద్దుకోవడానికి అయిదేళ్లు పట్టింది, అదృష్టవశాత్తు యివాళా ఆ అవకాశం పోలేదు. మీ కభ్యంతరం లేకపోతే....

క : (నవ్వి) శుభం. ఇదీ ఒకందుకు మంచిదే అయింది రాధ యిదివరకటి రాధ కాదు. శంకరంగారూ. కట్నాల మీద యిష్టం లేకపోయినా, అమ్మాయి బాగుకోసం - యివాళ పదివేలూ యిచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. అలాగే కానివ్వండి. అయితే నేనూ పెద్దవాళ్ళతో చెప్పి వాళ్ళ అనుమతి తీసుకోవాలి.

శం : తప్పకుండా తీసుకోండి. కాని ఒక షరతు.

క : ఏమిటది?

శం : కట్నాల ప్రసక్తితో నా మీద వెయ్యవలసిన బాణాలన్ని రాధే ప్రయోగించింది. ఇక ఆ వూసు ఎత్తి నన్ను బాధ పెట్టకూడదు. నాకెం కట్నం అక్కరలేదు. కట్నం అడిగిన మా నాన్నగారు చనిపోయారు. కట్నం కావాలనే ఆశ పుచ్చుకోవాలనే బుద్ధీ చచ్చిపోయాయి.

క : సరే మీ యిష్టం.

ఇంటిలో :

పరం : అయిదేళ్ళ కిందట అనుకొన్న పెళ్ళికొడుకే తటస్థపడడం, కట్నం ఒక్క నయాపైసా అక్కరలేకుండా పెళ్ళి చేసుకొంటాననడం అంతా దైవికం తల్లీ.

రాజా : ఇందులో ఆశ్చర్యం ఏముంది నాన్న-రోజులు మారాయి. రాధ మారింది. అతనూ మారాడు,

శాం : కట్నం లేకుండా చేసుకొంటాడంటే నా కనుమానమే. రెండో పెళ్ళేమిటో కనుక్కోండి మరోసారి.

అలి : బాగుందమ్మా- అయిదేళ్ళలో యిన్ని జరిగిపోతాయేమిటి? వదినెని చూశాకయినా నీకింకా మనుషుల మంచితనం మీద నమ్మకం కుదరలేదా ఏమిటి?

శాం : బాగుందే. నువ్వు కాలికీ మెడకీ వేస్తావు, అతన్నంటే నా కోడల్ని అన్నట్టేనా ఏమిటి?

రాజా : విన్నావా? అత్తగారిని కూడ కట్టేసుకొన్నావు యినాళ్ళకి,

క : సరేలెండి. (నవ్వి)- వాళ్ళు అంగీకరించేటట్టు చూడండి

రాజా : నా ఉద్యోగం నీ పనిని సమర్థించడమే. వాళ్లని ఒప్పించడం మాత్రం నీ పనే.

క : ఏం. మావయ్యా- అబ్బాయి మంచివాడు, ఉద్యోగం పెద్దది. మనిషిలో మార్పు వచ్చాక చేసుకొంటేనేం?

పరం : నీకు నేను చెప్పాలా తల్లీ. నీకు మంచిదనిపిస్తే అలాగే కానియ్యి.

క : ఏం అత్తయ్యా,

శాం : ఆయనదో మాట నాదో మాటానా తల్లీ. నీకు నచ్చినట్లె కానియ్.

పరం : ఎన్నాళ్ళకి నా మాటని అంగీకరించావే?

శాం : చాల్లెండి. మంచి చెప్తే ఎప్పుడు కాదన్నానూ?

అలి : అయితే మా కో ఆపరేటివ్ హాలులోనే పెళ్ళికి ఏర్పాట్లు చేయిస్తాం.

[సన్నాయి - వాద్యం పెళ్ళి జరిగిపోయింది]

అలి : ఇక వధూవరులిద్దరూ పెద్దలకి నమస్కారం చేసి ఆశీర్వాదాన్ని పొందండి.

రాధ : అమ్మా.

శాం : మా మాటకేం. మొదట మీ వదినెకీ, అన్నయ్యకీ నమస్కారం చెయ్యమ్మా.

క : అదేమిటత్తయ్యా. మీరు పెద్దలు. మీ తర్వాత మేము.

శాం : నీ ప్రయోజకత్వం ముందు మా పెద్దరికాలు ఎందుకు పనికొస్తాయి తల్లీ. ఆడదానివయినా ఒక్క చేతిమీద ఈ యింటిని చక్కదిద్దావు.

వరం : అమ్మా కళ్యాణీ. నీ వల్ల కదా తల్లీ ఈ యింటికి కళ్యాణ శోభ వచ్చింది.

అలి : వదినెకి, అన్నయ్యకి నమస్కారం చెయ్యి రాధా.

రాజా : [రహస్యంగా] వీళ్ళని దీవించటానికి నీ అనుమతి లభించినట్టేనా ?

క : [నవ్వి] ఇక నా పని అయిపోయింది. ఇప్పట్నుంచీ మీ మాటమీద నేను నడుచుకొంటాను. దీవించమని శలవా ?

రాజా : ఊఁ.

రాధ : వదినా.

క : చల్లగా నూరేళ్ళు వర్థిల్లమ్మా.

శం : ఈ బాంధవ్యాన్ని అప్యాయతల్నీ చూస్తుంటే మీలో ఒక్కరినయినందుకు నాకు చాలా సంతోషంగా వుంది. కళ్యాణిగారూ. చూడగా నా కళ్ళకి మీరో అద్భుతమయిన దేవతల్లాగ వున్నారు.

క : సరి. మూడు ముళ్లూ వేసి మూడు క్షణాలయిందో లేదో మీరు వీళ్ళలో కలసిపోయారే పొగడ్తలకి? నాకేం మర్యాదలూ మన్ననలూ వద్దు. నలుగురూ ఆనందంగా ఉంటే ఈ యింటి కోడలిగా- ఈయన భార్యగా- మీ అందరి ప్రేమాభిమానాలూ ఉంటే చాలు-

శం : హియర్. హియర్ - [చప్పట్లు]

[సమాప్తం]

ఫోన్ : పి. పి. 7078

దీపావళి శుభాకాంక్షలతో

# కృష్ణా మెటల్ స్టోర్సు.

[వెనుకటి రవి స్టోర్సు]

నమ్మకమైన స్టెయిన్‌లెస్ స్టీల్ సామాను

లభించుచోటు :

ప్రకాశంరోడ్డు — గవర్నరుపేట సెంటర్ విజయవాడ-2

కృష్ణా కో — ఆపరేటివ్ సెంట్రల్‌స్టోర్సు, రవిస్టోర్సులలో

20 సం॥ల అనుభవంతో మన్నికతో కూడిన

స్టెయిన్‌లెస్‌స్టీల్ పాత్రలు మార్కెట్‌లో అమ్మే ధరలకన్నా తక్కువకు గ్యారంటీగా యివ్వబడును.

సులభ వాయిదా పద్ధతి మరల మొదలు పెట్టినామని తెలుపుటకు సంతసించుచున్నాము.

రావి పిచ్చయ్య

ప్రొప్రయిటరు